"మళ్ళీ పెళ్ళా?" తెల్లబోతూ అడిగాడు ఆదికేశవులు.

"అవును కాకపోతే ఇదేమిటి?" శుభలేఖ ఆదికేశవులు మీదకి విసిరింది.

దాన్నిచూసి, కొన్ని క్షణాలు అర్థంకానట్లుగా చూశాడు ఆదికేశవులు భార్య వంక.

"మాట్లాడరేం?" గర్జించింది ప్రపూర్ణ ఆడసింహంలా గట్టిగా.

పకపకా నవ్వుతూ చెప్పాడు ఆదికేశవులు.

ఓహో గుర్తొచ్చింది పూర్వం బ్రహ్మచర్యంలో వున్నప్పుడు మా ఇంటాయనకో ప్రెస్సువుంది. ఆయన తయారుచేశారో కార్డు. నాకు రేషన్ కార్డు త్వరగా రావాలంటే, చక్కెర ఎక్కువ దొరకాలంటే, పెళ్ళయినట్లు అబద్ధం ఆడాలన్నాడు. అందుకీ అబద్ధపు సాక్ష్యాన్ని సృష్టించాడు కావాలంటే ఇప్పుడే ఆయనింటికి నడు"

## పెళ్ళిచూపులు

"సాయంత్రం కాలేజీ అయ్యాక మా ఇంటికోసారి రారాదు?" అడిగింది మైథిలి తన స్నేహితురాలిని.

"వస్తాను"

"నీవుకూడా రావే" సౌమిత్రికి చెప్పింది మైథిలి.

"ఎందుకు?" అడిగింది సౌమిత్రి.

"టీకి"

"ఏదైనా అకేషనా?"

"అవును"

"పుట్టిన రోజా?"

"నాకు పెళ్ళిచూపులు!"

చిన్నగా ఈలవేసింది సౌమిత్రి.

"కంగ్రాట్స్. కుర్రాడేంచేస్తున్నాడు?"

"ఉద్యోగం."

"అదేలేవే–ఏం వుద్యోగం?"

"ఆర్.టి.సి లో"

"జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పనిచేసే సంబంధం ఏమైంది?"

"నీకెలా తెలుసు?"

"హేమని పిలిచావటగా రెండు నెలల క్రితం పెళ్ళి చూపులప్పుడు?"

"నీకు చెప్పిందా? రహస్యంగా వుంచమన్నానే?"

"నీనుంచి రహస్యంగానే వుంచింది–మన క్లాసులో అందరికీ ఆ విషయం చెప్పినసంగతి." నవ్వింది సౌమిత్రి.

"ఆ సంబంధం?" అడిగింది మైథిలి స్నేహితురాలు.

"థంబ్స్ డౌన్ ఎప్పటి లాగానే."

"కట్నం నచ్చలేదా?"

"నేను."

"హేమని పిలవటంలేదా ఈసారి?" సౌమిత్రి అడిగింది.

"ఊహూ. చెప్పకుదానికి."

"ఎలా వుంటుందే పెళ్ళి చూపులు?"

"చూసావుగా రేపెప్పుడో నీకూ అనుభవం అవుతుంది. తప్పదు."

"నాది ప్రేమ వివాహం–నీలాగ కాదు."

"నిన్నూ, నన్నూ ఎవరు ప్రేమిస్తారే?"

"ష్! క్లాసులో వుంటే వుండండి. లేకపోతే బయటకు వెళ్ళండి. ఏమిటా మాటలు పాఠంవినకుండా?" కోపంగా అరిచింది ఇంగ్లీష్ లెక్చరర్. మైథిలి, సౌమిత్రి, వాళ్ళ స్నేహితురాలివంక చూసి.

ముగ్గురూ వెంటనే పుస్తకంలోకిసీరియస్‌గా చూస్తున్నట్లునటించారు.

"ఓడ్ టుది వెస్ట్ విండ్" పద్యం కనపడింది వాళ్ళకి.

సంవత్సరం మీద కొన్ని నెలలయ్యాక ఓరోజు సౌమిత్రికి బెజవాడ రైల్వేస్టేషన్‌లోని వెయిటింగ్ రూంలో కనపడింది మైథిలి.

"ఏమేఎలావున్నావ్? కొడుకా?" అడిగింది సౌమిత్రి మైథిలిని చేతిలోని బిడ్డని చూసి.

"కాదు! కూతురు... ఏమండి నా స్నేహితురాలు సౌమిత్రి తెలుసుగా?" అడిగింది మైథిలి.భర్తని సౌమిత్రికి పరిచయం చేస్తూ.

"గుర్తులేదు" చెప్పాడాయన.

"నా పెళ్ళిచూపులకి సౌమిత్రి కూడా వచ్చింది. మర్చిపోయినట్లున్నారు?"

"ఓహో హో! అలాగా, గుర్తొచ్చింది" నవ్వాడాయన.

"ఎక్కడికి నువ్వు?"

"గుంటూరులో ఏదో వుద్యోగానికి ఇంటర్వ్యూ వస్తే వెళుతున్నాను"

"వుద్యోగం ఎందుకే హాయిగా పెళ్ళి చేసుకోక?" చెప్పింది మైథిలి.

"పెళ్ళిచూపుల్లో అన్నీ థంబ్స్ డౌన్ ఇప్పటిదాకా" విచారంగా చెప్పింది సౌమిత్రి.

"మీకో ఓ టాక్క చెప్పనా?" అడిగాడు మైథిలి మొగుడు సౌమిత్రిని.

"ఏమిటి! చెప్పండి"

"పెళ్ళ చూపుల్లో హైమలాంటి మీకన్నా అందమయిన స్నేహితురాళ్ళనికాక మీ కన్నా అంద విహీనమయన వాళ్ళని పక్కన వుంచుకోండి చాలు! మీరు బ్రహ్మాండంగా వుంటారు చూసేవాళ్ళకి."

"ఏమిటండి ఆ మాటలు?" చిరుకోపంగా అన్నది మైథిలి భర్తతో.

"నాకెం తెలుసు! ఇది నువ్వు ఆచరించిన వుపాయమేగా" మృదువుగా నవ్వాడు.

# బానిస

నగేష్ వయస్సు ఇరవైనాలుగు బేంక్‌లో ఆఫీసర్. మెటిల్డాతో ప్రేమలో పడ్డాడు. మెటిల్డా అతను పనిచేసే డివిజనల్ ఆఫీస్‌లో క్లర్క్.

ప్రేమలో పడ్డవాళ్ళు చాలామంది చేసే పనులన్నీ చేసారు ఇద్దరూ. ఏ.సి. హోటల్ కెళ్ళి కాఫీతాగి రెండు గంటలు కూర్చుని మాట్లాడు కోవటం, సినిమాకివెళ్ళడం, టేంక్‌బండ్‌కి, జూపార్క్‌కి నగేష్ స్కూటర్‌మీద ఉస్మాన్‌సాగర్‌లోని పార్క్‌కి, తిరిగి వస్తూ గోల్కొండ కోటకి వెళ్ళటం, తన స్నేహితుడింటికి టీకి వెళ్ళటం....

సంగతులన్నీ పేపరులో పడ్డంత తేలికగా నగేష్ తండ్రికి, మెటిల్డా తల్లి కి తెలిసాయి.

ప్రేమలో పడ్డ జంట తల్లిదండ్రులు చాలామంది చేసే పనులన్నీ చేసారు ఇద్దరూ ఆ సంబంధం తమ కిష్టంలేదని స్పష్టం చేసారు. చేసు కుంటే ఇక ఆ యింటి గడప తొక్క కూడదని వాదించారు చచ్చిపోతా మన్నారు. చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళు కావన్నారు కులాంతరమేగాక. మతాంతర వివాహం అసలు భరించలేమన్నారు ఇవన్నారు అదన్నారు ఏమన్నా నవ ప్రేమికులిద్దరూ చలించలేదు.

"అదివాడికేదో మందుపెట్టింది" నగేష్ తల్లి కళ్ళు వత్తుకుంది. రిజిష్టర్ మేరేజ్ చేసుకోబోతున్నారని తెలిసి.

"వాడు దీనికేదో మంత్రం వేశాడు" మెటిల్డాతల్లికూడా కళ్ళు వత్తుకుంది. మర్నాడు రిజిష్టర్ మేరేజ్ అనగా నగేష్ తండ్రి కొడుకుని మరోసారి ఆ ప్రయత్నం విరమించుకోమని అర్థించాడు.

"నో ఫాదర్" చెప్పాడు నగేష్.

కూతుర్ని తల్లి ఆఖరిసారి కోరింది ఆ వివాహం రద్దు చేసుకో మని.

"నో మదర్" చెప్పిందిమెటిల్డా.

"నువ్వు దానికి బానిసయ్యావు" అరిచాడు నగేష్ తండ్రి.